

# ఓ తండ్రి డైరీ ...!

"వేద ప్రభాస్"

**15 సెప్టెంబర్ 1991**

ఈ రోజు పొద్దుటి నుంచీ వర్షం కురుస్తోంది.

చీకటి పడే వేళకి కూడా తగ్గలేదు. పెద్ద వానేం కాదు గానీ విడవకుండా పడుతోంది. వీధి దీపం, చుట్టూతా పోగయిన చీకటి సైన్యంతో ఒంటరిగా పోరాటం సాగిస్తోంది. చుట్టూ చీకట్లు కమ్ముకుంటున్న వేళ మనసంతా వ్యాకులంగా ఉంది. ఒక్కణ్ణే వరండాలో కూర్చుని సిగరెట్టు వెలిగించేను.

లోపల గదిలో అరుంధతీ, అమ్మాయి ఇంకా మాటల్తో యుద్ధం చేస్తున్నట్టున్నారు కానీ ఆ సంభాషణేదీ నా చెవుల్లో జొరబడలేకపోయింది. నా మెదడు బాగా వేడెక్కిపోయి ఉంది మరి. వాళ్లిద్దరూ ... ఇద్దరే ... రెండు వ్యతిరేక ధృవాలు ... రెండు జతకాని స్వరాలు ...

అరుంధతి సంగతి ఇరవై ఆరేళ్లుగా బాగా తెలుసు నాకు. ఆమె పూర్తిగా తెలిసిపోయింది. ఇంక ఆమెలో కొత్తగా ఏదైనా తెలియాలంటే ఆమెలో మార్పు రావాలి. అలా మార్పు వచ్చే పరిస్థితులెన్నో వచ్చినా ఆమె మారకపోవడంతో నేనామె గురించి ఆలోచించడం మానేశాను. ఇప్పటి సంగతి అది కాదు. తల్లిగా ఆమె వాదనలో నాకీ నాడు తప్పేమీ కనిపించలేదు.

అమ్మాయి సంగతే ఏమీ అంతుబట్టకుండా వుంది. అది వుద్యోగం చేస్తున్న ఈ రెండేళ్లుగా చాలా మారిపోయినట్టుగా నాకీ రోజే బాగా అర్థమైంది. ఇరవై అయిదేళ్ల ప్రజ్ఞలో నేను అర్థం చేసుకోలేని విశేషాలు చాలానే ఉన్నట్టుగా కనబడుతున్నాయి. తరాల అంతరం సంగతి నాకు బాగానే తెలుసు. నేను సామాజిక శాస్త్ర అధ్యాపకుణ్ణి కూడా ...!

ప్రజ్ఞ ఈ కాలం ఆడపిల్ల. అలాగే పెంచాను దాన్ని. జీన్ పాంట్లలో, బాగీ షర్ట్‌లతో, బాబ్డ్ హెయిరూ, మాంటో గ్లాసెస్‌తో నవీనంగా కనిపించే నా కూతురంటే నాకు చెప్పలేని ప్రేమ. సంస్కృతీ పరిణామం తీరు తెన్నులు నిరంతరం గమనిస్తున్న వాణ్ణే .. పిల్లని పాతకాలం దాన్లా ఎలా పెంచగలను ..? అరుంధతి చిరాకు పడుతున్నా, చాలా విషయాల్లో నన్ను తప్పు పట్టినా .. నేను ఆమె మాటల్ని లక్ష్యపెట్టలేదు. పెళ్లయ్యాక అరుంధతిలో మానసిక పరిణామం దాదాపుగా ఆగిపోయినట్టు నేను గమనించేను. సాధారణంగా పాతతరం స్త్రీలందరూ అంతేనేమో ..

ప్రజ్ఞ చాలా తెలివైందీ, చురుకైందీ కూడా! ఈ రోజు వరకూ అది అన్ని రంగాల్లోనూ విజయాల తర్వాత విజయాలు సాధిస్తూనే వచ్చింది. నాకు నా నమ్మకాల పునాదులు బలపడుతూనే వచ్చేయి. ప్రజ్ఞ తరవాత వాడు చిన్మయ్. వాణ్ణి చాలా శ్రద్ధగా పెంచాను నేను. అలాగని ప్రజ్ఞని పెంచటంలో ఏ లోపమూ చెయ్యలేదు నేను. నిజం చెప్పాలంటే, వాడి కంటే అమ్మాయంటేనే అరుంధతికీ, నాకూ కూడా చాలా ఆపేక్ష... ఐనా ప్రజ్ఞ అంటు కట్టవలసిన కొమ్మ ... చిన్మయ్ అంటిపెట్టుకుని వుండే కొమ్మల్లాంటి వాళ్లు కదా మా సంసార వృక్షానికి. లోకరీతి అవగాహనలో ఉన్నవాణ్ణి కనుక, ఉద్యోగం తప్ప వేరే ఇతర వ్యాపకాలేవీ లేనివాణ్ణి కావటం వలనా వాళ్లిద్దర్నీ నా అభిరుచుల కనుగుణంగా తీర్చి దిద్దడమే నా హాబీ అయింది. ఫలితాలు కూడా చాలా సంతృప్తికరంగా ఉంటూ వచ్చాయి.

ప్రజ్ఞ అగ్రికల్చర్‌లో డిగ్రీ చేసి డిమాన్ స్ట్రేటర్ ఉద్యోగం తెచ్చుకుంది. చిన్మయ్ ఇంజనీరింగ్ అవుతూనే ఐఎఎస్‌లో సెలక్టయి పోయి ఇప్పుడు ఢిల్లీలో ఉన్నాడు. వాడు చాలా బ్రిలియంట్. నాకు ఇంతవరకూ జీవితం లేత చిగుళ్లు తొడుగుతూ ఎదుగుతున్న మందార మొక్కలా హరిత భరితంగా ఉంది. సమస్యలేవీ ఎదురు కానంత వరకూ ఎవరికైనా అంతేనేమో మరి ...!

ఈ రోజు మాత్రం పచ్చని చెట్టుమీద గొంగళి పురుగల మంద చుట్టుముట్టి దాడి చేసినట్టుగా, నన్ను ఒక్కక్కొసారిగా సమస్యలు చుట్టుముట్టాయి. ప్రజ్ఞ కారణంగానే ..., నాకిది అనూహ్య పరిణామం కావడంతో, వీధి వరండాలోకి వచ్చి కూర్చుండిపోయాను.

రాదనుకున్న వర్షం వచ్చి జోరుగా కురిసి పోతోంది. చూస్తూ ఉంటే జల ప్రళయం వస్తుందేమో అనిపించేలా ఉంది. చిరుచలిగా ఉంది. కుర్చీలో దగ్గరగా ముడుచుకు కూర్చుని ఇంకో సిగరెట్టు వెలిగించాను.

లోపల మాటలెప్పుడో ఆగిపోయినట్టుగా ఉన్నాయి.

అరుంధతి బయటికి వచ్చింది. అటువైపు చూసి తలతిప్పుకున్నాను. ఆమె చలికి చీరకొంగు భుజం చుట్టూ తీసుకుంటూ,

"ఒక్కరూ ... ఇక్కడ చలిలో కూర్చోకపోతే ... లోపల కొచ్చి ఆ రాక్షసికి నచ్చ చెప్పొచ్చుగా ...!" అంది

నేను మాట్లాడలేదు. తల కూడా తిప్పకుండా తిన్నగా వర్షంలోకే చూస్తూ కూర్చున్నాను. రెండు నిముషాలు గడిచాయి.

మా మధ్య నిలబడిపోయిన మౌనపు తెరను తప్పిస్తూ అడిగింది అరుంధతి-

"కాఫీ ఇచ్చేదా ...?"

మృదువుగా మారిన ఆమె స్వరంలోని లాలన నన్ను విచలితుణ్ణి చేసింది. తలెత్తి ఆమె మొహంలోకి చూశాను.

ఆమె కళ్లు ఎర్రగా ఉన్నాయి. జుత్తు కొద్దిగా రేగిపోయి ఉంది. బొమముడి ఇంకా పూర్తిగా వీడిపోలేదు.

ప్రజ్ఞతో మాట్లాడి ఆమె ఏ విషయం ఒప్పించలేదన్న సంగతి నాకు బాగా తెలుసు ... అందులోనూ ఈ విషయంలో ... ఐనా ఆమె సంతృప్తి కోసం అడిగాను.

"ఐతే ... అది నీమాట వినలేదన్న మాట ...!"

అరుంధతిలో కోపం ఒక్కసారిగా పొంగి వచ్చింది. కొంచెం విసురుగా -

"మీరలా పెంచేరేమిటి దాన్ని ...?" అంది.

సంవత్సరాల తరబడి భద్రంగా దాచిపెట్టుకున్న ఆయుధం తీసి ఒక్కసారి కసిగా ప్రయోగించింది అరుంధతి.

నేనేం మాట్లాడలేకపోయాను.

ఇంకా అరుంధతి ఇంకేమనేదో గానీ ఇంతలో గేటు బయట జీపు వచ్చి ఆగింది. డిపార్టుమెంటు డ్రైవరు మూర్తి రుమాలు తలమీద కప్పుకుని వర్షంలో తల తడవకుండా జాగ్రత్త పడుతూ పరుగులాంటి నడకతో వరండా మీదకి వచ్చాడు. అరుంధతి లోపలికి వెళ్లిపోయింది.

"నమస్కారం సార్! అమ్మాయిగారున్నారా ..?" వినయంగా అడిగాడతను. నేనేం జవాబు చెప్పకమందే లోపల నుండి ప్రజ్ఞ కేకేసింది.

"వొస్తున్నా ... ఉండు మూర్తీ!" అని

"ఎరువులిచ్చే టైంలో మా కష్టాలు చెప్పలేనన్ని సార్! ఒక వేళా పాళా ఉండదు సార్ ... తిన్నామో, ఉన్నామో ఎవరికీ పట్టదు ... ఎవరికి, ఏ కారణం చేత అందకపోయినా తప్పు మాదే అంటారంతా ..." రుమాలుతో మోచేతులు తుడుచుకుంటూ మూర్తి ఏదేదో మాట్లాడుతున్నాడు.

లోపల నుండి రెయిన్ కోటు తొడుక్కుంటూ ప్రజ్ఞ వరండాలోకి వచ్చింది. షూరేక్‌లో నుండి కాన్వాస్ షూస్ తీసి తొడుక్కుంది.

"పద, మూర్తీ ...!" అంటూ మెట్లు దిగి జీపు వైపు నడిచింది.

నాతో ఏం చెప్పలేదు అమ్మాయి. ఎక్కడికో, ఎందుకో కూడా చెప్పలేదు. అలా అదెప్పుడూ చెయ్యలేదు.

నాకు మనస్సులో ఎక్కడో లోతుగా గాయమైంది.

అది రెండు చేతులూ రెయిన్ కోటు జేబుల్లో పెట్టుకుని హుందాగా నడిచి వెళ్లిపోతుంటే, నాకు వయస్సు ఒక్కసారిగా, బరువుగా మీద పడ్డట్టనిపించింది.

జీపు దాకా వెళ్లాక సీట్లో కూర్చోబోతూ ప్రజ్ఞ వెనక్కి తలతిప్పి వరండాలో కూర్చున్న నా వంక చూసినట్లనిపించింది. నేను కంగారుగా కుడివైపుకు తల తిప్పి, చూరు నుండి ధారగా కారుతున్న నీటి వంక దృష్టి మళ్లించాను.

మా ఇద్దరి మధ్య మౌన పోరాటం ప్రారంభమైందని నాకు తెలిసి పోయింది. అసలు నాకూ, అమ్మాయికీ మధ్య ఇలాంటి పరిస్థితి వస్తుందని నేనెప్పుడూ ఊహించలేకపోయాను. నేనిది సహించలేక పోతున్నాను. నా మనస్సులో మంచు పర్వతం చేరి కూర్చున్నట్టుంది.

జీపు వెళ్లిపోయింది జోరుగా కురుస్తున్న వానలో...

ఆవరణలోని మామిడి చెట్టు కిందగా వున్న మోటారు షెడ్డు రేకుల మీద వాన చినుకులు చప్పుడు చేస్తూ పడుతున్నాయి.

ఎర్రటి వరండా గచ్చు దీపం వెలుతుర్లో పగడాల చెరువులా మెరుస్తోంది.

అరుంధతి గ్లాసుతో కాఫీ తెచ్చి ఇచ్చింది. మళ్లా లోపలికి వెళ్లి ఒక చేత్తో కాఫీ కప్పుతో మరో చేత్తో కుర్చీతో తిరిగి వచ్చింది. నా పక్కగా తన కుర్చీ వేసుకుని కూర్చుని మౌనంగా కాఫీ తాగుతోంది. నేను కప్పుతో కాఫీ తాగను. గ్లాసుతో తాగడమే నాకిష్టం.

ప్రజ్ఞ అందుకే అప్పుడప్పుడూ నన్ను వెక్కిరిస్తూ ఉంటుంది -

"డాడీ హేజ్ సమ్ ఓల్డ్ స్పాట్ ..." అంటూ.

"దాన్ని వొంచటం బ్రహ్మ తరం కాదు ...!" ఆకస్మాత్తుగా అంది అరుంధతి

నేను ఊరుకున్నాను. అరుంధతి అన్న రెండు మాటలూ ఆవిడ ఇవ్వబోయే ఉపన్యాసానికి నాంది అని నాకు తెలుసు.

"చంద్ర శేఖరం గారి అబ్బాయికేం తక్కువ .. ఆర్ అండ్ బీలో పెద్ద ఇంజనీరు. రెండు చేతుల్తో కూడా తెచ్చుకుంటున్నాడు. చూడ్డానికి ఏ సినిమా హీరోకీ తీసిపోడు. వాళ్లింటి చుట్టూ సంబంధాల వాళ్లు తిరుపతి కొండకి వెళ్లే వాళ్లలా వచ్చిపోతున్నారు. రాజ్యం వొదినెకి మనమ్మాయంటే ఆపేక్షా ... మన మంటే అభిమానమూ కనుక వాళ్లు కోరీ, వేడీ చేసు కుంటామంటున్నారు. మరి దీనికేం పట్టుకుందో నా కర్థం కావటం లేదు. ఎప్పుడడిగినా ఏం మాట్లాడదు. పెళ్లి వద్దంటుందే గానీ, కన్నతల్లిని నాకన్నా కారణం చెప్పదు. దాంతో ఎంతసేపని వాదులాట వేసుకోను. అరిచీ, తిట్టీ నా గొంతు పడిపోవడమే గానీ స్పష్టంగా నోరు విప్పి సంగతేదో చెప్పదు.

అసలు మిమ్మల్ననాలి. మీరు గట్టిగా చెప్తే అది కాదన్లేదు.. మీకేమయ్యిందో, నాకు తెలీటం లేదు. దాంతో గదిలో పది నిముషాలు మాట్లాడి ఇవతలకి వచ్చి కూర్చుండిపోయారు. నాకంతా అయోమయం గా ఉంది. అసలది మీతో ఏమందో ముందు నాకు చెప్పండి. ముంగిలాగ కూర్చోకండి. రేపు మళ్లీ వొదిన రావడమో, ఫోన్ చెయ్యడమో చేస్తానంది. వాళ్లకే సంగతీ తేల్చి చెప్పకపోతే మర్యాదగా ఉండదు మరి ...!"

నేను కళ్లద్దాలు తీసి తుడుచు కుంటూ ఉండిపోయాను. చెప్పడానికేం లేక కాదు .. చెప్పడానికి చాలానే వుంది. అయితే అరుంధతితో ఎలా చెప్పాలో తెలీటం లేదు.

"మాట్లాడరేమండీ ..? మిమ్మల్నే ..!!" అరుంధతి స్వరంలో ఆర్తి, ఏదో అవ్యక్త ఆందోళనా నన్ను విచలితుణ్ణి చేశాయి.

"అమ్మాయి ... ఆ సంబంధం చేసుకోదు అరుంధతీ..!'

"ఏం? ఎందుకు చేసుకోదట ..? ముఖేష్ కేం తక్కువట ..?"

అరుంధతి స్వరంలో ధ్వనించిన ఆవేశానికి మూలం బాధ అని నాకు తెలుసు. ఇప్పుడామెకి చెప్పాలి.

"ప్రజ్ఞ ... ఎవరో ముస్లిమ్ కుర్రాడితో ఉంటుందట!"

ఉంటుందనే చెప్పాను. మరి అమ్మాయి నాతో చెప్పిందదే ... కనీసం అతన్ని పెళ్లి చేసుకుంటానని కూడా చెప్పలేదు..

ఆ మాటలు చాలు ... అరుంధతి నోట మరి మాట రాకుండా చెయ్యడానికి.

అరుంధతి చేతిలోని కప్పు కిందపడి మోగింది ... పగల్లేదు ... కానీ చప్పుడు కాకుండా ఆమె గుండె పగిలి ఉంటుందని నాకు తెలుసు.

నేను నెమ్మదిగా మాట్లాడాను. స్పష్టంగా చెప్పాను.

"నాకూ వివరంగా తెలీదు అరుంధతీ! ఆ ముస్లిమ్ కుర్రాడెవరో డాక్టరట ... దీనికి ఆర్నెల్ల క్రితం ఏదో మీటింగులో పరిచయమయ్యాడుట. దీనికి పెళ్లి మీద నమ్మకం లేదు కనుక అతడిని ఇది ... ఉంచుకుంటుందట ..." (సరిగ్గానే వాడేనా ఆ పదాన్ని ... అశ్లీలమైతే కాదు కదా ...! ఆ సంగతి ఇంగ్లీషులో నాతో చెప్పిందది మరి ...!) ఆ మాట అంటున్నప్పుడు నాలో ఏదో చచ్చిపోయినట్లైంది.

చేతిలో ఉన్న కాఫీ గ్లాసు వేడి చల్లారిపోయింది. అది పడిపోకుండా పదిలంగా పట్టుకున్నాను.

తల కొద్దిగా తిప్పి అరుంధతి వైపు చూశాను.

ఆమె అలాగే చలనంలేకుండా కూర్చుని ఉంది.

ఆమె మంచుముద్దలాగా, మైకం కమ్మిన దాన్లా కదలికలు లేకుండా వుండిపోయింది. బయట వర్షం తగ్గుతోంది. నల్లటి ఆకాశంలో వుండీ వుండీ



## బాలీవుడ్ బాణీ

అందాల ముద్దు గుమ్మ మమత కులకర్ణికి కూడా రాజకీయాల్లోకి దిగిపోవాలనే ఆలోచన అకస్మాత్తుగా వచ్చింది. నటిగా రాణించడంతో పాటు రాజకీయ నేత్తగా, దర్శకురాలిగా కూడా పేరు తెచ్చుకోవాలన్నది ఆమె అభిలాషట. "నాకు రాజకీయాలంటే చాలా ఇష్టం. శివసేనలో చేరాలని ఇష్టపడుతున్నాను. సంజయ్ విషయంలో బాల్ థాకర్ చేసిన కృషి నిజంగా ప్రశంసనీయం" అని పొగిడేసింది. అంతేకాదు ఏదో ఒక రోజు దర్శకురాలిని కూడా అయిపోతానని చెబుతోంది... చూద్దాం.....

మసూద్ అన్సారీ

మెరుపులు జిగేల్మంటూ మెరుస్తున్నాయి. వరండాలో ఒంటరిగా వెలుగుతున్న దీపం చుట్టూ దీపం పురుగులు గిరికీలు కొడుతున్నాయి.

నేను దాన్ని ఎప్పుడూ దేనికీ అడ్డుపెట్టలేదు. ఇప్పుడు మాత్రం నేను అంగీకరించలేకపోతున్నాను. సంప్రదాయం చెడిపోతుందేమోనన్న భయం తో కాదు. అది మా కులం కుర్రాడిని చేసుకోనంటున్నందుకూ కాదు ...

అది నిర్భీతిగా ఆ ముస్లిం డాక్టరెవర్నో ఉంచుకుంటాననడం ...

పెళ్లి మాటైనా అన్లేదు ప్రజ్ఞ. అసలు పెళ్లే చేసుకోనన్నా నేనింత బాధపడకపోదును. కాలంతో పాటు దాని నిర్ణయం మారుతుందని సరిపెట్టుకునేవాడిని. ఉంచుకుంటానంది. ఉంచుకోవడం అంటే, కుక్కపిల్లనో, కుందేలుపిల్లనో పెంచుకోవడం లాగానా ...! వివాహ బంధానికి వీసమెత్తు విలువ ఇవ్వటం లేదది ..!

గుండెనెవరో నలుపుతున్నట్టుగా ఉంది. కడుపులో గాభరాగా, ఆందోళనగా ఉంది.

పెళ్లి చేసుకోవట మంటే గొలుసుల్తో చుట్టేసుకోవడమే అంది. స్వేచ్ఛ ఉండదుట ...! కాలేజీ రోజుల నుండీ అది వీర ఫెమినిస్టు ... దాని భావాలన్నిటినీ నేను అప్పుడు అభినందించి ప్రోత్సహించాను... కానీ ఆకాశంలో సగమే అయిన మా అమ్మాయికి మిగిలిన ఆ రెండో సగంతో కలిసి మెలిసి మమేకం అయి పూర్ణాకాశంగా మారేందుకు అవకాశమిచ్చే వివాహం అంటే ఇంత పచ్చి వ్యతిరేకత ఉన్నదన్న సంగతి నేను చిత్రంగా అసలు కనుక్కోలేకపోయాను.

గంట క్రితం ప్రజ్ఞ చెప్పిన మరో విషయం నాలో కలవరాన్నీ, కంపరాన్నీ కలిగించింది. అరుంధతితో ఆ విషయం నేను చెప్పలేను ...

సన్నగా వెక్కిళ్లు వినబడడంతో త్రుళ్లి పడి అరుంధతి వైపు తలతిప్పి చూశాను. ఆమె చీర కొంగు నోటి కడ్డంగా పెట్టుకుని తల కిందకు దించుకుని ఏడుస్తోంది.

నాకు బాధగా ఉంది ... తప్పంతా నాదేనన్న గిల్టీ ఫీలింగు నన్ను తినేస్తోంది.

అరుంధతి ఏడవగలుగుతోంది. ఏడవటం ద్వారా ఆమె కాస్తయినా ఉపశమనం పొందుతుంది.

జ్వాలలు ... వలయాలు వలయాలుగా హృదయాన్ని మండిస్తుంటే నా కళ్లల్లోంచి కన్నీరెలా వస్తుంది ..? చక్కదనాల పిల్ల .. తీరైన చందనపు బొమ్మలాంటిది. చక్రవర్తి లాంటి అల్లుడిని కట్టుకుని, ముచ్చటైన ముత్యం లాంటి మనవడిని నా చేతి కందివ్వాల్సింది. పెళ్లి కూడా కాకుండానే, వారం రోజుల క్రితం అబార్షన్ చేయించుకున్నాని నిర్భయంగా, నిర్లజ్జగా తండ్రితో చెప్పగలిగిందంటే ... సెక్సంటే, చర్మం మీద దురదేస్తే గోక్కోవటం లాంటిదే అన్న అభిప్రాయంతో ఉందంటే, కాదు చిట్టితల్లీ ...! నీ ఆలోచన సరైంది కాదమ్మా ...! అని ఒక్కసారిగా నే ననలేకపోయాను. అందుకే మరింకేం మాట్లాడకుండా వచ్చి వరండాలో కూర్చుండిపోయాను.

నిర్వేదం నన్ను అలుముకుంది.

"మీరే చేశారంతా ...! " అరుంధతి ఏడుస్తూనే అంది.

ఆమె తల నా భుజం మీదకి చేర్చుకున్నాను. కుడి చేతిని ఆమె భుజం చుట్టూ వేసి అరుంధతిని దగ్గరగా పొదివి పట్టుకున్నాను. నాకు స్వాంతన లభించినట్లైంది. లైటు వెలుతుర్లో అరుంధతి తలమీద పాపిట దగ్గరగా ఉన్న తెల్ల వెంట్రుకలు వెండి తీగల్లాగా మెరుస్తున్నాయి. ఆమె కట్టుకున్న కాఫీ రంగు నేత చీర పైట చెరగు మీద రెండంగుళాల వెడల్పుతో ఉన్న ఎర్రటి అంచు ఎంతో అందంగా కనిపిస్తోంది. తెల్లటి ఆమె మెడ చుట్టూ ఉన్న మంగళసూత్రం తాడు పచ్చగా పవిత్రంగా ఉంది. పవిత్రత... మనసు లోపలి పొరల్లోంచి అసంకల్పితంగా వూడి పడ్డదా మాట ... మంగళ సూత్రమే పవిత్రతా ...? అది లేకపోతే అపవిత్రమైనట్టేనా ... భార్యా భర్తల అను బంధం ...? ఆ ప్రశ్నకు సమాధానం వెతుక్కోవటంలో నామనసిప్పుడు తడబడి పోతోంది. తల్లకిందులై పోతోంది.

నేను నా తరం వాళ్ల కన్నా ప్రగతి పథంలో చాలా ముందుగానే ఉన్నాను. కనీసం ఉండాలని ప్రయత్నించాను. కానీ నిన్నగాక మొన్న పుట్టిన నా కూతురి ముందు వివాహం అన్న పదం వాడి నేను, నా తరానికి వెనక తరాల దగ్గరకి జారిపోయేను. దాని జీవితం దానిష్టప్రకారమే సాగాలన్న నిర్ణయమే నాది. కానీ దాన్ని కన్న తండ్రిగా దాని సాంఘిక భద్రత చూసే బాధ్యత నామీద లేదా ..? వివాహం అనే సంప్రదాయం పూర్తిగా తిరస్కరించాల్సి నంత హేయమైనదా ...? ప్రజ్ఞ నిర్ణయాన్ని నా మనసెంత మాత్రం అంగీకరించలేకపోతోంది. శతాబ్దాల తరబడి సంప్రదాయం పోగుచేసుకున్న బలమేనా అందుకు కారణం ..? వందల వేల తరాలుగా అవిరళంగా వస్తున్న నాలోని జన్యువులు ఈ ఆకస్మిక సాంప్రదాయ ఉత్పరివర్తనానికి అంగీకరించలేకపోవట మేనా నా ఈ అంతరంగ మథనానికి కారణం ..?

" ఈ రాత్రి ... ఎంత రాత్రయినా సరే ... మీరేం చేస్తారో నా కనవసరం. దాన్ని ముఖేష్‌తో పెళ్లికి ఒప్పించాల్సిందే. అతడికీ ఇదంటే చాలా ఇష్టం. తర్వాత్తర్వాత దీని వెర్రి మొర్రి చేష్టలన్నీ అతను భరిస్తాడు. మీరలా చెయ్యలేకపోయారంటే మాత్రం పొద్దునే తొమ్మిది గంటల మెయిల్లో నేను మా అన్నయ్య దగ్గరికి బెంగుళూరు వెళ్లిపోతాను. అదీ, నేనూ కలిసి మరెంత మాత్రం ఈ ఇంట్లో ఉండేందుకు వీల్లేదు. ఆపైన మీరేం చేస్తారో మీ ఇష్టం. ఇంక లేవండి. భోజనం చేద్దురు గాని. రొజ్జగాలి కొడుతోంది. మళ్లా మీ వొంటి కేమైనా వస్తే ఇబ్బంది"

లేచి నిలబడి ఆ మాటలని అరుంధతి లోపలికి వెళ్లిపోయింది. రెండు నిమిషాలయ్యాక లోపల్నుంచి మళ్లీ ఆమె పిలవడంతో నేను లేచి వీధి వరండాలో లైటు తీసేసి ఇంట్లోకి వచ్చాను.

బయట చీకటి పెరిగింది నాలోపల్లాగానే ... -

ధారలుగా ఇంకా వర్షం కురుస్తూనే ఉంది. చచ్చిపోతున్న సంప్రదాయాన్ని చూసి సంప్రదాయ వాదులు చేస్తున్న రోదనలాగా ...ఈ రోజు డైరీలో చాలా పేజీలే రాయాల్సొచ్చింది. రోజూ రాయకపోవటం, రాసినప్పుడు ఎక్కువ పేజీలు రాసెయ్యటం అలవాటైపోయింది.

బహుశా రేపు రాసే అవసరం రాకపోవచ్చు. మళ్లీ చాలా కాలం దాకా రాయనేమో కూడా ...!

3 నవంబర్ 1995.

ఈ రోజు మళ్లీ డైరీ రాయాలన్పించింది.

ఈ రోజు మూతలు పడిపోయిన నా మనసు గది తలుపులు విశాలంగా తెరుచుకున్న రోజు. అందుకే మళ్లీ డైరీ రాస్తున్నాను.

సాయంత్రం ఐదు గంటలు దాటి ఉంటుంది.

ఇంటి ముందు ఏదో జీపు ఆగింది. చాలా కాలమే అయ్యింది ఇంటి ముందుకి జీపు వచ్చి ... చిన్మయ్ ఎప్పుడు వచ్చినా కార్లోనే వస్తాడు.

నేను నా గది కిటికీ లోంచి చూశాను.

ఆ సాయం సంధ్య వెలుతుర్లో, బంగారు రంగు సూర్యకిరణాల కాంతిలో అందమైన బొమ్మలాగా అమ్మాయి జీపు దిగి నిలబడింది. నేను గబగబా కళ్లద్దాలు వెతికి తెచ్చి పెట్టుకుని కళ్లనిండా చూశాను. నా గుండె వేగంగా కొట్టుకుంటోంది.

ప్రజ్ఞే ...! ఈ నాలుగేళ్లలో లావయ్యింది. కిటికీ పక్కగా నిలబడి రహస్యంగా కర్టెన్ చాటు నుండి చూస్తూ ఉండిపోయాను. అరుంధతి లోపలెక్కడో ఉన్నట్టుంది. ఈ మధ్య తనకి మొక్కల పెంపకం మీదకి ధ్యాస మళ్లింది. పొద్దున్నా సాయంత్రం ఒక వేళని లేదు. ఆ మొక్కల మధ్యే కాలం గడిపేస్తోంది. మొక్కల మధ్య ఉంటే అరుంధతికి కీళ్ల నొప్పులు జ్ఞాపకం రావు.

డ్రైవింగ్ సీట్లోంచి దిగి నిలువెత్తు యవ్వనం లాగా నిలబడ్డాడు ప్రజ్ఞ పక్కనే బలమైన యువకుడొకడు. అందంగా ట్రిమ్ చేసిన గడ్డంతో, వెడల్పైన మొహంతో పచ్చని పసిమి ఛాయతో ఉన్నాడతను. ప్రజ్ఞ అటు వైపు తిరిగి వుంది. ఏదో చెపుతోంది అతన్తో ... అతను జీపు వెనక్కి వెళ్లి ఎవరితోనో ఏదో చెప్పేడు. నౌకరు లాంటి కుర్రాడొకడు పళ్ల బుట్ట కాటోలు లాగి కిందకి పెట్టాడు.

ప్రజ్ఞా, ఆ యువకుడూ ఒకరినొకరు అనుకుని

## బాలీవుడ్ బాణీ



భార్యకు విడాకులిచ్చిన అజారుద్దీన్‌కు పట్ట పగ్గాలు లేకుండాపోయాయి. క్రమేపి సంగీతా బిజిలానిని క్షణం కూడ వదలకుండా షికార్లు చేస్తున్నారు. నారిమన్ పాయింట్ వద్ద గ్రే మెర్సిడెస్ కారులో అజర్ కన్పించాడు. ముందు సీట్లో ఆయన పక్కన కూర్చున్నది ఎవరో తెలుసా... ఇంకెవరు? సంగీతానే. అమితాబ్ బంగ్లా 'ప్రతీక్ష' పక్కనే ఒక అధునాతన అపార్ట్ మెంట్‌ను ఇటీవలే అజర్ కొన్నాడు... ఇదే అపార్ట్‌మెంట్లో మధురీదీక్షిత్ కూడా ఒక ఫ్లాట్ తీసుకుంది.... భార్యకు విడాకులిచ్చాడు కనుక సంగీతా మెళ్లో మూడు ముళ్ల వేసి కొత్త ఇంట్లో కొత్త సంసారం మొదలు పట్టేందుగాను సన్నాహాలు చేస్తున్నాడు.

మసూద్ అన్సారీ

నెమ్మదిగా మాట్లాడుకుంటూ గేటు దాటి ఇంట్లోకి వస్తున్నారు. వెనకాతలే బుట్టతో ఆ నౌకరు లాంటి కుర్రాడూ ...

నాలో కంగారు మొదలైంది.

ఇప్పుడిది ఎందుకు వస్తున్నట్టు ...? ఛటుక్కున కిటికీ చాటు నుండి పక్కకు తప్పుకున్నాను. ఆలోచనా ప్రవాహం సన్నగా మొదలై, ధారై, ఝరై నన్ను ముంచెత్తుతోంది

అరుంధతి వాళ్లకెదురైతే బాగుండునను కున్నాను. లేకపోతే నేనే దానికీ, అతడికీ ఎదురు పడాల్సి వచ్చేటట్టుంది. అది నా వల్ల కాని పని. నా మనస్తత్వానికి సరిపడని పని.

చటుక్కున పుస్తకాల షెల్ఫులోంచి చేతి కందిన పుస్తకాన్ని లాగి, కళ్లద్దాలు సర్దుకుని ఈజీ ఛెయిర్‌లో కూర్చుండిపోయాను.

కళ్లు తెరచి వున్న పుస్తకాన్నే చూస్తున్నాయి కానీ, నేను అప్పుడు చెవులతో శబ్దాల్నే చదివాను.

సన్నగా వినబడింది ప్రజ్ఞ గొంతుక.

"లుక్! అమీర్!! ఈ మామిడి చెట్టుకే ఉయ్యాల కట్టి, నేనూ, తమ్ముడూ వేసవికాలం మధ్యాహ్నాలు తెగ ఊగేవాళ్లం ... వాడికి వేగంగా ఊగడమంటే భయం ... వద్దే అక్కా ... నెమ్మదిగా ఊగవే అని నన్ను చంపుకు తినేవాడు. ఐ థింక్ యు హేడ్ ఎ లాంగ్ టాక్ విత్ హిమ్ లాస్ట్ వీక్ వెన్ యు మెట్ హిమ్ ఎట్ హైద్రాబేడ్ ... హౌ డు యూ ఫీల్ అబౌట్ హిమ్ ...?"

కుతూహలం ప్రజ్ఞ ప్రశ్నలో.

"యస్ ... యస్ డియర్! ఐ హేడ్ స్పెంట్ విత్ హిమ్ క్వైట్ ఎ లాంగ్ టైమ్ ... రియల్లీ హీ ఈజ్ నైస్ గై ..."

"థేంక్‌యూ అమీర్! హీ ఈజ్ నాటోన్లీ నైస్ ...! చాలా బ్రిలియంట్ కూడా ...! పూర్తిగా నాన్న పోలికే వాడు ..." గర్వం అమ్మాయి స్వరంలో

వాళ్లు గుమ్మంలోకే వచ్చినట్టున్నారు. నా గుండె గొంతుకలోకి వచ్చినట్టు ఫీలయ్యాను ... అరుంధతీ ... అరుంధతీ ... ఎక్కడికి వెళ్లిపోయావు నువ్వు అనుకున్నాను.

డోర్ బెల్ మోగిన శబ్దం ... సన్నటి ఆ సంగీత ధ్వని నా గుండెల మీద ఢమరుకం లాగా మోగింది.

నేను వచ్చాను నాన్నా ...! నా జీవితాన్ని మహతీ వాద్యం లాగా మార్చుకుని, నా బ్రతుకుని పసిడి సైరుగా పండించుకుని, నేనొచ్చాను నాన్నా ...! అని చెప్పేందుకే వచ్చినట్టుంది అమ్మాయి ... నా ప్రాణంలో ప్రాణం. నాగుండె తునక .. ఒకప్పటి నా కలల కన్యరూపం ... నాలుగేళ్ల కిందటి మా ఇంటి చైతన్య చిత్రం ...

గుండె గట్టుకు గండి పడి కళ్ల కాలువలు జలపూరితాలయ్యేయి. నా హృదయంలో ఎగసి పడుతున్న అనుభూతి తరంగాలు చెలియలి కట్టను చెరిపేసేలా అనిపించాయి.

ఓడిపోయానా నేను ...? నువ్వు కోరుకుంటున్నది ఏంత మాత్రం స్వేచ్ఛకాదనీ, విశృంఖలత్వం అనీ ... మగతోడు కావలసివచ్చినా, వివాహ బంధం అవసరం లేదని నువ్వు నిర్ణయించుకుంటే, నీకూ నాకూ మరి సంబంధం వుండేందుకు వీల్లేదని శాసించిన నేనీనాడు దాని ముందు ఓడిపోయానా ...? ఓడిపోనీ ... పర్వాలేదు ... ఓటమి ఇంత మధురంగా ఉంటే, విజయమెవడి క్కావాలి ..?

నా చిట్టి తల్లి ... నా చైతన్యపు మణి దీపం ... మలిగిపోతుందేమోనని, జీవితంలో మలిగిపోతుం దేమోననీ, ఇంతకాలం లోలోపలే ఎంతగా వ్యధ చెందేననీ, ఎంతగా నా ఆత్మ బలాన్ని చీలికలు, పేలికలుగా చింపుకున్నానని ...!

మళ్లీ డోర్ బెల్ మరోసారి మోగింది.

గబగబా నడిచి గుమ్మం దగ్గరకు వెళుతున్న కాలి మువ్వల సవ్వడి వినిపించింది. అరుంధతి వెళ్లిందన్న మాట ...! నాకన్నా అరుంధతికే ఎక్కువ కోపం అమ్మాయి మీద. అయినా ఈ నాలుగేళ్ల కాలంలో ఆమె కోపం చాలా తగ్గిపోయింది. ఈ మధ్య కాలంలో ప్రజ్ఞని చూడాలనే కోరిక ఆమెలో బలీయమవుతూ వస్తోంది. నేనే దృఢంగా నిలబడి పోయినట్టు నటిస్తున్నాను గానీ, .... అరుంధతి చాలా సార్లు బయట పడిపోయింది. ఇప్పుడిక అరుంధతిలో ఆనందం అర్ణవమైపోతుంది.

నాలో ఈ నాలుగేళ్లుగా వున్న వ్యధంతా నెమ్మదిగా కరిగిపోసాగింది. నా బాధంతా తొలగి పోతోంది. పట్టుదలే ... కేవలం పట్టుదలే ... మునిపంట నలిగిపోతున్న కంది పెదిమగా మిగిలిపోయింది కొద్దిసేపు.

అమ్మాయి వొచ్చి ... "డాడీ ...!" అంటే నా పట్టుదలంతా సూర్య కాంతికి మంచు తెరలా కరిగిపోదూ ...!

రానీ, అమ్మాయినే రానీ ...! నేను దానికంటే పడను. దాని మాటల అమూల్య రత్నాలని, దాని ఆనందపు అనుభవాల భావప్రకటనల్ని, దొంగ చాటుగా ఏరుకుని, భద్రంగా దాచుకుంటాను ... చిన్నప్పుడు అది బుడి బుడి నడకలు నడిచేటప్పుడు, దాని ముద్దు మాటల ముత్యాలను మహదానందంగా ఏరుకుని నా జ్ఞాపకాల ఖజానాలో దాచుకోలేదూ ...! వీటినీ ఆ పక్కనే దాచుకుంటాను ... ఎవ్వడెత్తుకు పోగలడు నా అనుభూతుల అనర్ఘరత్నాలను ...?

తలుపు తెరవగానే అరుంధతి మొహంలో కన్పించే భావాలను పక్క నుండి పరిశీలించాలని, నా కెంతగానో అనిపించింది. కానీ కదల్లేదు నేను ... ఏం...? ఆ కూతురికి తండ్రిని కానా నేను ...? ఇన్నాళ్ల కాలం అది పట్టుదలగా ఉండిపోతుందీ ...? దానికంటే నాకు పట్టుదల ఎక్కువేననీ ... కనీసం గంటో, అరగంటో పాటన్నా ఎక్కువే నని ... నేను నిరూపించుకోవద్దూ ...

మనసులో ఉద్వేగం ఆపుకోలేనంతగా కలుగుతున్నపుడే డైరీ వ్రాయటం ... కాళ్ల తడి ఆరకముందే భోజనం ముగించెయ్యటం నాకు బాగా అలవాటు ...

వాళ్లు ముగ్గురూ ఇటే వస్తున్నట్టున్నారు ...

తలుపు చప్పుడవుతోంది. ఇంక రాయటం కుదరదు.

**4 నవంబర్ 1995.**

సాయంత్రం నాలుగు గంటలప్పుడు అమీర్‌తో చదరంగం ఆడుతున్నాను.

నాలుగు నెలల గర్భవతి మా అమ్మాయి. నేను కూర్చున్న సోఫా అంచుమీద కూర్చుని నా భుజం మీద తలవాల్చి రెండు చేతుల్తో నన్ను చుట్టేసి చదరంగం బల్ల వంకే చూస్తోంది.

అమీర్ చాలా బాగా ఆడుతున్నాడు. అతను చాలా తెలివైనవాడని అతన్తో మాట్లాడిన మొదటి అరగంటలోనే గ్రహించాను. అరుంధతి కీళ్ల నొప్పులకు, అతను శ్రద్ధగా పరీక్ష చేసి మందులు రాసివ్వడంతో అరుంధతికి అతనంటే ఆపేక్ష కలిగి పోయింది. అమ్మాయినీ, అతణ్నీ చూసినప్పటి నుంచీ ఆమె సంతోషానికి హద్దులు లేకుండా పోయాయి.

నేను అమీర్ ఏనుగును పట్టుకున్నాను. అందుకు నేను శ్రమ పడ్డాననే చెప్పాలి.

గడ్డం సాలోచనగా రాసుకుంటూ అమీర్ కొంచెంసేపు ఉండిపోయాడు. నాకు గర్వం కలిగింది. స్టేట్ టోర్నమెంటులో ఆడిన వాణ్ణి మరి నేను ...

చదరంగం బల్ల మీద అమీర్ చెయ్యి కదిలింది. అది అతని శకటు పట్టుకోగానే నా మొహం పాలి పోయింది. నేను ఆ కదలిక ఊహించలేకపోయాను.

అమీర్ తన శకటు కదిపి నా మినిస్టర్‌ను అష్టదిగ్బంధనం చేశాడు.

నాకు మతిపోయింది. మరే ఆలోచనా తోచ కుండా పోయింది.

ఇంతలో అరుంధతి ట్రేలో కాఫీ కప్పుల్తో వచ్చింది.

అలవాటుగా ట్రేలోని కాఫీ గ్లాసు అందుకున్న నేను ఒక్క క్షణం పాటు దాని వంకే చూశాను.

"డాడ్ హేజ్ సమ్ ఓల్డ్ స్పాట్ ...!" ప్రజ్ఞ అంటుండే మాటలు గుర్తొచ్చాయి.

కాఫీ గ్లాసు ట్రేలో పెట్టేసి, అందులో వున్న కప్పు అందుకున్నాను.

అరుంధతి పరమాశ్చర్యంతో చూసింది నావైపు.

"ఈ రోజు నుంచి నేను కప్పుతోనే కాఫీ తాగుతాను ... అరుంధతీ ...! గుర్తు పెట్టుకో ... మరెప్పుడూ గ్లాసుతో ఇవ్వద్దు ..." చెప్పానామెతో.

ప్రజ్ఞ చటుక్కున తలతిప్పి, నా వంక చురుగ్గా చూసి, చెంప మీద ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంది.

నాకు చాలదూ ... ఆ బహుమతి! ●



## బాలీవుడ్ బాణీ

చాలా కాలం తర్వాత ఇంద్రకుమార్ దర్శకత్వంలో సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఓ సినిమా ప్రారంభోత్సవానికి తోటి తారలు అమిర్‌ఖాన్, మాధురీదీక్షిత్‌లతో అమితాబ్ కూడా వచ్చాడు. అయితే వయస్సు పాద మీదపాడినా, పదేళ్లుగా సినిమాల్లో నటించకపోయినా బచ్చన్ అందం చెక్కుచెదరలేదు... సరి కదా... అమిర్‌ఖానంత ఎంగ్‌గా అతను కన్పించాడు.... అమితాబ్ తన అందన్ని కాపాడుకోవడం వెనుక రహస్యమేమిటని ఆరాధిస్తే, ఇతాను బిజినెస్ పనిపై స్టేట్స్‌కు వెళ్లినపుడు పనిలో పనిగా ఫిట్‌నెస్‌లో కూడా శిక్షణ తీసుకున్నాడట... అదన్న మాట అసలు సంగతి...!

మసూద్ అన్సారీ